రాజన్న సిరిసిల్ల జిల్లా పోతుగల్‌లో ఇటీవల విద్యుత్తు షాక్‌తో మరణించిన జంగ శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ తరపున రూ.2 లక్షల చెక్కు అందించి ఓదార్చుతున్న ఎమ్మెల్యే కేటీఆర్

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు ఎమ్మెల్యే కేటీఆర్ భరోసా

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): 'అధైర్య పడకండి.. అన్ని విధాలుగా అండగా ఉంటా' అని ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ భరోసా ఇచ్చారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, గంభీరావుపేట మండలాల్లో ఆయన పర్యటించారు. కొత్త జంటలను ఆశీర్వదిస్తూ, ఆప్తులను కోల్పోయిన కుటుంబాలను పరామర్శిస్తూ, గ్రామాల్లోని పలువురిని పలకరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో ఉన్న వారిని దవాఖానలో చేర్పించి బాగుచేస్తానని హామీ ఇచ్చారు. ఉదయం 11:30 గంటలకు ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చేరుకున్న కేటీఆర్.. సోషల్ మీడియా కార్యకర్త సాయి కృష్ణ వివాహం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అక్కడి నుంచి బొప్పాపూర్‌కు వెళ్లి నవదంప తులు ప్రశాంత్‌రెడ్డి, అఖిలను ఆశీర్వదించారు. అనంతరం రెడ్డి సంఘం మండలాధ్యక్షుడు గుండాడి వెంకటరెడ్డి నివాసానికి చేరుకుని నాలుగు రోజుల క్రితం వివాహం చేసుకున్న నరేశ్‌రెడ్డి, చందన దంపతులను ఆశీర్వదించారు. ఎల్లారెడ్డిపేటలో నూతనంగా నిర్మించిన సహకార సంఘం భవనాన్ని సందర్శించారు. సంఘం చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డితో పాటు డైరెక్టర్లను అభినందించారు. హరిదాస్‌నగర్‌లో జడ్పీటీసీ సభ్యుడు చీటి లక్ష్మణ్‌రావు గృహప్రవేశానికి హాజరయ్యారు. అక్కడే జడ్పీటీసీ సభ్యుడు లక్ష్మణ్‌రావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఇల్లెందుల శ్రీనివాస్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలకు హాజరయ్యారు. అదే గ్రామంలో దళిత బంధు పథకంతో సమిష్టిగా ఏర్పాటుచేసిన 'నయారా' పెట్రోల్ బంక్‌ను ప్రారంభించారు. అక్కడి నుంచి ముస్తాబాద్ మండలం చేరుకుని అయ్యప్ప ఆలయంలో జరిగిన మహాపడిపూజలో పాల్గొని పూజలు చేశారు. అయ్యప్పలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ యూత్ నాయకుడు గుణశేఖర్ సోదరి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. పోతుగల్ గ్రామంలో ఇటీవల విద్యుదాఘాతంతో చనిపోయిన హెల్పర్ జంగ శ్రీనివాస్ కుటుంబసభ్యులను, గంభీరావుపేట మండలం శ్రీగాధలో పార్టీ సీనియర్ నాయకులు మాణిక్‌రావు, చొక్కారావు కుటుంబసభ్యులను, మండల కేంద్రంలోని ఎంపీటీసీ సభ్యుడు దేవేందర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు వెంకట్ యాదవ్ కుటుంబసభ్యులను పరామర్శించారు.

ప్రజాపాలనకు నోడల్ ఆఫీసర్లు

- ఉమ్మడి జిల్లాలవారీగా నియామకం

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి ప్రారంభం కానున్న ప్రజాపాలనను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం నోడల్ ఆఫీసర్లను నియమించింది. ఉమ్మడి జిల్లాలవారీగా ఐఏఎస్‌లకు బాధ్యతలను అప్పగిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దేవసేనకు కరీంనగర్, టీకే శ్రీదేవికి మహబూబ్‌నగర్, రఘునందన్‌రావుకు ఖమ్మం, ఈ శ్రీధర్‌కు రంగారెడ్డి, వాకాటి కరుణకు వరంగల్, నిర్మలకు హైదరాబాద్, సంగీతకు మెదక్, ప్రశాంతికి ఆదిలాబాద్, ఆర్వీ కర్ణన్‌కు నల్లగొండ, క్రిస్టినా జడ్ చోంగ్తూకు నిజామాబాద్ జిల్లా బాధ్యతలు అప్పగించింది. వీరంతా ఆయా జిల్లాల్లో పర్యటించి ప్రజాపాలనపై అధికారులకు అవగాహన కల్పించాలని, దరఖాస్తుల విధానాన్ని పర్యవేక్షించాలని సూచించింది. హైదరాబాద్‌లో జోన్లవారీగా ఐఏఎస్‌లను నియమించింది.

నిజమైన అర్హులకు 'గ్యారెంటీ'లు

- ప్రజాపాలనతో ప్రజల వద్దకే ప్రభుత్వం
- దరఖాస్తులిచ్చిన 100 రోజుల్లో అమలు
- 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఆ తర్వాత ఎంపీడీవో, తహసిల్దార్ ఆఫీసుల్లో దరఖాస్తు చేసుకోవచ్చు
- డిసెంబర్ 9లోపు 2 లక్షల పోస్టుల భర్తీ
- రైతుబంధు పరిమితిపై అసెంబ్లీలో చర్చిస్తం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
- ప్రజాపాలన దరఖాస్తు ఫారాల విడుదల

సచివాలయంలో ప్రజా పాలన దరఖాస్తు ఫారాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి, తుమ్మల, సురేఖ, సీఎస్

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని, నిస్సహాయులకు సాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రజా పాలన ద్వారా ప్రజలు ప్రభుత్వం వద్దకు రాకుండా ప్రజల వద్దకే ప్రభుత్వాన్ని తీసుకెళ్తున్నామని చెప్పారు. గురువారం నుంచి జనవరి 6వ తేదీ వరకు ఐదు గ్యారెంటీలకు సంబంధించి అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. బుధవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖతో కలిసి ప్రజా పాలన దరఖాస్తు ఫారాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకొనేందుకే ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. పథకాలకు నిజమైన అర్హులు ఎవరు? ఎంత మంది ఉంటారు? అనే లెక్క ప్రభుత్వం వద్ద ఉండాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. అప్పుడే తాము ఒక ప్రణాళిక ప్రకారం పని చేస్తామని అన్నారు.

గడువు తర్వాత కూడా దరఖాస్తుకు అవకాశం

జనవరి 6 వరకు ఆయా గ్రామ పంచాయతీలు, పట్టణాల్లో దరఖాస్తులు తీసుకుంటామని సీఎం తెలిపారు. ఒకవేళ 6వ తేదీ వరకు కూడా దరఖాస్తు చేసుకోలేకపోతే వాళ్లు ఎంపీడీవో, ఎమ్మార్వో కార్యాలయాల్లో ఎప్పుడైనా దరఖాస్తు ఇవ్వొచ్చని సూచించారు. కొత్త రేషన్‌కార్డులకు కూడా దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. కొత్త రేషన్‌కార్డుతో పాటు ఇతర సమస్యల దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఇప్పటికే రేషన్‌కార్డు ఉన్నవారు గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకోవాలని, లేనివాళ్లు మరో కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్యారెంటీలతోపాటు అన్ని సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను ప్రజా పాలనలో స్వీకరిస్తామని వివరించారు.

ఒకరి దరఖాస్తు మరొకరు ఇవ్వొచ్చు

గ్యారెంటీలకు లబ్ధిదారులే స్వయంగా వచ్చి దరఖాస్తు ఇవ్వాల్సిన అవసరం లేదని, వారి తరపున ఎవరైనా ఇవ్వొచ్చని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. దరఖాస్తుదారుకు సంబంధించిన రేషన్‌కార్డు, ఆధార్‌కార్డును దరఖాస్తుకు జత చేయాలని సూచించారు. సీఎం ప్రకటనతో ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్న వారికి ఉపశమనం లభించనున్నది.

వచ్చే డిసెంబర్ 9లోపు 2 లక్షల ఉద్యోగాల భర్తీ

టీఎస్‌పీఎస్సీ వివాదంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. ఇప్పటికే టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులు రాజీనామాలను గవర్నర్‌కు అందించారని, పలు కారణాలతో వాటిని గవర్నర్ ఇంకా ఆమోదించలేదని తెలిపారు. సాంకేతికంగా చైర్మన్ లేకుండా నోటిఫికేషన్లు ఇవ్వరాదని అన్నారు. నాలుగైదు రోజుల్లోనే రాజీనామాలపై గవర్నర్ నిర్ణయం తీసుకుంటారని, ఆ తర్వాత వేగంగా చైర్మన్, సభ్యులను నియమిస్తామని చెప్పారు. ఆ తర్వాత అత్యంత పారదర్శకంగా కొత్త నియామకాలు చేపడతామని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వచ్చే ఏడాది డిసెంబర్ 9వ తేదీలోపు 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసి తీరుతామని చెప్పారు. గ్రూప్-2 పరీక్ష నిర్వహణపై అధికారులతో సమీక్షించిన తర్వాత నిర్ణయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు.

100 రోజుల్లో అమలు చేస్తాం

దరఖాస్తులు తీసుకుంటున్న ఐదు గ్యారెంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని సీఎం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత చూస్తే ఇక్కడ ఖాళీ కుండలే ఉన్నాయని, కేసీఆర్ అండ్ ఫ్యామిలీ మొత్తం ఊడ్చుకొని వెళ్లిందని విమర్శించారు. తాము లంకె బిందెలు ఉన్నాయని వస్తే.. ఖాళీ గిన్నెలు కనిపిస్తున్నాయని, ఇప్పుడు అంతా సెట్‌రైట్ చేయాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. మూడోసారి గెలిస్తే తిరిగేందుకు మాజీ సీఎం కేసీఆర్ కొత్తగా 22 ల్యాండ్ క్రూజర్ కార్లను కొని విజయవాడలో పెట్టినట్టు సీఎం చెప్పారు. మేడిగడ్డకు సంబంధించి న్యాయ విచారణ జరుగుతున్నదని, ఇందులో ఎల్ అండ్ టీ, ప్రభుత్వ అధికారుల పాత్ర ఏమిటనేది తేలుతుందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల ఆటో డ్రైవర్ల పరిస్థితిని ముందే ఊహించామని, అందుకే వారికి ఆర్థికసాయం అందిస్తామని మ్యానిఫెస్టోలోనే పెట్టినట్టు గుర్తుచేశారు. రైతుబంధు సీలింగ్‌పై ఇప్పటివరకు ఎలాంటి పరిమితి విధించలేదని, అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఎం చెప్పారు.

నేటి నుంచే గ్యారెంటీల మేళా

మొదటిపేజీ తరువాయి...

విడుదల చేశారు. అనంతరం దరఖాస్తు ఫారాలను జిల్లాలకు చేరవేశారు. చాలా వరకు ఆయా గ్రామాల్లోని కాంగ్రెస్ నేతలు దరఖాస్తు ఫారాలను జిరాక్స్ తీయించి ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. మరికొన్ని చోట్ల అధికారులు పంచుతు న్నారు. వాట్సాప్‌లో దరఖాస్తు ఫారం సర్క్యులే ట్ కావడంతో ఎవరికి వారు జిరాక్స్ తీసుకుంటున్నారు. దరఖాస్తు ఎలా చేయాలి? ఎవరెవరు చేయాలనేదానిపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దరఖాస్తు ఫారాలు నింపేందుకు అంగన్‌వాడీలు, ఇతర ఉద్యోగుల సహకారాన్ని కూడా తీసుకుంటున్నారు. ఏ గ్రామంలో ఎప్పుడు దరఖాస్తు తీసుకుంటారనే సమాచారా న్ని ఇప్పటికే ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులకు అధికారులు సమాచారం ఇచ్చారు.

ప్రతి 100 దరఖాస్తులకు ఒక కౌంటర్: సీఎస్

రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలు, 3,626 మున్సిపల్ వార్డులతో కలిపి మొత్తం 16,395 ప్రదేశాల్లో ప్రజాపాలన సదస్సులు నిర్వహించడానికి రాష్ట్రవ్యాప్తంగా 3,714 అధికార బృందాలను ఏర్పాటు చేశామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. సీఎం విడుదల చేసిన ప్రజాపాలన దరఖాస్తు ఫారాలు అన్ని గ్రామాల్లో విస్తృతంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆమె ఆదేశించారు. బుధవారం రాత్రి ఆమె కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజా పాలన కార్యక్రమ పర్యవేక్షణకు అన్ని ఉమ్మడి జిల్లాలకు సీనియర్ అధికారులను నియమించామని తెలిపారు. గ్రామసభలు ఉదయం 8 గంటలకే ప్రారంభించాలని సూచించారు. మహిళలకు పురుషులకు వేరు వేరు క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, ప్రతి 100 దరఖాస్తు దారులకు ఒక కౌంటర్ చొప్పున పెట్టాలని ఆదేశించారు.

లోకం పోకడ



కాంగ్రెస్ నేత గుప్పిట్లో 'గ్యారెంటీ దరఖాస్తులు'

మా పార్టీకి ఓట్లేసిన వారికే రాస్తామంటూ హుకుం

జోగుళాంబ గద్వాల జిల్లా గువ్వలదిన్నెలో ఘటన

కేటీదొడ్డి, డిసెంబర్ 27: ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు బుధవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం గువ్వలదిన్నె గ్రామానికి చేరిన దరఖాస్తు పత్రాలను.. కాంగ్రెస్ నేత శ్రీనివాస్‌రెడ్డి బలవంతంగా గుప్పిట్లోకి తీసుకున్నారు. మొత్తం 457 దరఖాస్తు పత్రాలు రాగా.. 441 పత్రాలను తీసుకెళ్లారు. పంచాయతీ కార్యదర్శిని బెదిరించి దౌర్జన్యంగా లాక్కెళ్లారు. ఈ క్రమంలో తమకు కూడా పథకాలు కావాలని అక్కడున్న మహిళలు ప్రశ్నించగా.. 'మీరు మా పార్టీకి ఓటేయలేదు.. మా పథకాలు మీకెందుకు? వచ్చే ఎన్నికల్లో మా పార్టీకి ఓటేస్తామని చెప్తేనే మీకు ఇస్తాం' అంటూ దూషించారని స్థానికులు ఆరోపించారు. ఈ విషయాన్ని కార్యదర్శి ధ్రువీకరించాడు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	11.1°c	34.9°c
ఆదిలాబాద్	13.0°c	33.4°c
మెదక్	13.1°c	32.9°c
ఖమ్మం	16.0°c	30.0°c
నల్లగొండ	16.0°c	28.0°c
కరీంనగర్	16.0°c	29.0°c
నిజామాబాద్	16.8°c	31.6 °c
వరంగల్	17.0°c	29.0°c
హైదరాబాద్	17.5°c	29.4°c
మహబూబ్‌నగర్	18.6°c	31.8°

వీఆర్ఏల సమస్యలు తీరుస్తాం: పొంగులేటి

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): ఎంప్లాయ్‌మెంట్ ఐడీ రాకముందు వీఆర్ఏలు ఎదుర్కొంటున్న సమస్యను వారంలో పరిష్కరిస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చినట్టు ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా నాయకులు కలిశారు.

రిజిస్ట్రేషన్ శాఖ రాబడి పెంచండి

రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం సచివాలయంలో రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు త్వరలో శాశ్వత భవనాలు నిర్మిస్తామని చెప్పారు.

మేడారంలో కాలుష్యం ఉండొద్దు: కొండా సురేఖ

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): మేడారం జాతరలో ప్లాస్టిక్ కాలుష్యం లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని అటవీశాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు. బుధవారం సచివాలయంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఉద్యోగులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

విత్తనాల కొరత రావద్దు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): రైతులకు విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. విత్తనాలు, పత్తి కొనుగోలుపై బుధవారం సచివాలయంలో అధికారులతో వేర్వేరుగా సమీక్ష నిర్వహించారు.

దరఖాస్తు పేరుతో దగా

- గ్యారెంటీల ఎగవేతకే ఈ హడావుడి
- పార్లమెంట్ 'కోడ్' దాకా కాలయాపన
- టైంపాస్ చేయడానికే దరఖాస్తులు
- కేసీఆర్ కొన్న వాహనాలు ఇష్టంలేకపోతే.. వాటిని అంబులెన్స్‌లుగా మార్చండి
- బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న దాసోజు శ్రవణ్. చిత్రంలో కోలేటి దామోదర్

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు దరఖాస్తుల స్వీకరణ పేరుతో ప్రజలను దగా చేయబోతున్నదని బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ఆరు గ్యారెంటీల ఎగవేతకు ప్రభుత్వం దారులు వెతుకున్నదని ధ్వజమెత్తారు. బుధవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేత కోలేటి దామోదర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర సచివాలయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గాంధీభవన్‌గా భావిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా ఇతర ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సమక్షంలో రాజకీయ ప్రసంగాలు చేయటాన్ని తప్పుబట్టారు. కేసీఆర్ పాలనలో లబ్ధిదారుల ఎంపిక పార్టీతో సంబంధం లేకుండా జరిగిందనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. సచివాలయం వేదికగా కేటీఆర్, హరీశ్‌రావుపై వ్యక్తిగత విమర్శలు చేయటాన్ని తప్పుబట్టారు.

తెలంగాణ పరువు తీస్తున్న రేవంత్

కేసీఆర్ బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను కొనుగోలు చేసి వాటిని విజయవాడలోనే ఉంచారని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డికి ఆ వాహనాలు ఇష్టంలేకపోతే అంబులెన్స్‌గా వాడాలని దాసోజు శ్రవణ్ సూచించారు. సర్కార్ దగ్గర లంకెబిందెలు ఉండవు. దస్తావేజులు, కాగితాలు ఉంటాయని చురకలేశారు. అసెంబ్లీలో శ్వేతపత్రాలు పెట్టి అభాసు పాలైందికాక ప్రధాని ముందు కూడా తెలంగాణ పరువు తీశారని మండిపడ్డారు. ఓ అభాగ్యురాలిని కేటీఆర్ ఆడుకుంటే 'ఏడుపు ఎందుకు?' అని ప్రశ్నించారు.

టైంపాస్‌కే దరఖాస్తులు

తెల్లరేషన్ కార్డులు ఉంటేనే ఆరు గ్యారెంటీలకు అర్హులని చెప్తున్న సర్కార్, తిరిగి దరఖాస్తులు చేసుకోవాలని కోరడం వెనుక కుట్ర దాగి ఉన్నదని దాసోజు శ్రవణ్ ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల కోడ్ వచ్చేదాకా దరఖాస్తుల పేరుతో టైంపాస్ చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను ప్రకటించినపుడు షరతులు ఉంటాయని ఎందుకు చెప్పలేదని నిలదీశారు. అవసరం తీరాక ప్రజలను మోసం చేయటం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని ఆరోపించారు.

రైతుబంధు ఏది?

రైతులకు డిసెంబర్ 9న రైతుబంధు కింద రూ.15 వేలు చెల్లిస్తామని బీరాలు పలికిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇప్పుడు ఆ ముచ్చటనే విస్మరించారని దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. సచివాలయాన్ని కేసీఆర్ దేశానికే తలమానికంగా నిర్మిస్తే దాన్ని దుబారా అన్న సీఎం రేవంత్‌రెడ్డి, ఇష్టం లేకపోతే దాన్ని బీఆర్ అంబేద్కర్ దవాఖానగా మార్చాలని దాసోజు శ్రవణ్ సూచించారు. ప్రగతిభవన్‌ను ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చాలని సూచించారు. సీఎం క్యాంప్ ఆఫీసు ఉండగా ఇప్పుడు రేవంత్‌రెడ్డి ఎంసీహెచ్‌ఆర్‌డీలో ఎకరం స్థలంలో కొత్తగా సీఎం క్యాంపు కార్యాలయం ఎందుకు కడుతున్నట్టు? అది దుబారా కాదా? అని పశ్నించారు.

పైసలు లేనప్పుడు యాడ్స్ ఎందుకో?

రాష్ట్రం అప్పుల పాలైందని, కేసీఆర్ రాష్ట్రాన్ని దుబారా చేశారని పదేపదే అంటున్న సీఎం రేవంత్‌రెడ్డి, నమస్తే తెలంగాణ మినహా దేశంలోని అన్ని పత్రికలకు యాడ్స్ ఎందుకు ఇచ్చారని దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి మీడియా సమావేశంలో జర్నలిస్టులను అరే నాయనా.. అని సంబోధించటం ఏమిటని మండిపడ్డారు.

ప్రజలకు జవాబుదారీగా బడ్జెట్

కేంద్రం నిధులు 100% వాడుకోవాలి

ఆర్థికశాఖ సమీక్షలో సీఎం రేవంత్

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర బడ్జెట్‌ను ప్రజల కోణంలో రూపొందించాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సవాళ్లు, మన ముందున్న లక్ష్యాలు అన్నీ ఉన్నది ఉన్నట్టుగా ప్రజలకు చెప్పేద్దామని పేర్కొన్నారు. అసలైన తెలంగాణ ఇప్పుడే వచ్చిందనుకొని బడ్జెట్ తయారుచేయాలని అధికారులకు సూచించారు. దుబారా చేయకుండా, వృథా ఖర్చులు తగ్గించాలని ఆదేశించారు. వచ్చే ఆర్థిక సంవత్సరపు వార్షిక బడ్జెట్‌ను రాష్ట్ర ఆదాయ, వ్యయాల వాస్తవికతను ప్రతిబింబించేలా రూపొందించాలని స్పష్టంచేశారు. బుధవారం ఆయన సచివాలయంలో డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్లను నూటికి నూరుపాళ్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆదాయం, ఖర్చులపై పక్కాగా అంచనాలను రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. కేంద్రం నుంచి వీలైనన్ని గ్రాంట్లను రాబట్టేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. కొంత మేరకు రాష్ట్రం వాటా చెల్లిస్తే కేంద్రం తన వంతు వాటాగా ఇచ్చే నిధులను ఎట్టి పరిస్థితుల్లో వదులుకోవద్దని అధికారులను అప్రమత్తం చేశారు. దీంతో కేంద్రానికి పేరు వస్తుందనో, రాష్ట్ర ప్రభుత్వానికి పెద్దగా పేరు వచ్చేది లేదనో బేషజాలకు పోవద్దని అన్నారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే అంతిమ లక్ష్యంగా బడ్జెట్ కసరత్తు జరగాలని సమావేశంలో నిర్ణయించారు.

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

సీనియర్ కన్సల్టెంట్లు

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) లిమిటెడ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 11
- పోస్టులు: సీనియర్ కన్సల్టెంట్, కన్సల్టెంట్, మేనేజర్
- దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 18
- వెబ్‌సైట్: www.sail.co.in

గెస్ట్ ఫ్యాకల్టీ

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్- సోషల్ సైన్సెస్ విభాగంలో తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 2
- పోస్టులు: గెస్ట్ ఫ్యాకల్టీ
- అర్హతలు, ఎంపిక తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు
- దరఖాస్తు: ఈ-మెయిల్ ద్వారా
- చివరితేదీ: జనవరి 1
- వెబ్‌సైట్: https://uohyd.ac.in

సీఏఎస్ఈ-2023

సీఎస్ఐఆర్ పరిధిలోని సంస్థల్లో ఖాళీల భర్తీకి నిర్వహించే కంబైన్డ్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ ఎగ్జామినేషన్ (సీఏఎస్ఈ)-2023 నోటిఫికేషన్ విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 444
- పోస్టులు: సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్
- విభాగాలు: జనరల్, ఫైనాన్స్& అకౌంట్స్, స్టోర్స్ అండ్ పర్చేజ్
- అర్హతలు: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 12
- వెబ్‌సైట్: https://www.csir.res.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- ఎకానమీ, హిస్టరీ, సోషల్ స్టడీస్ (గ్రూప్స్, డీఎస్సీ) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

హైర్ బస్సుల సమ్మె సైరన్

మొదటిపేజీ తరువాయి...

హైర్‌బస్ యజమానులు కోరుతున్నారు. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరుతున్నారు. ఓవర్‌లోడ్ కారణంగా కేఎంపీఎల్ బాగా తగ్గిపోయిందని, మైలేజీ 4.8 కిలోమీటర్లకు పడిపోతున్నదని చెప్తున్నారు. కాబట్టి కేఎంపీఎల్‌ను 4.5 కిలోమీటర్లకు తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు. లీజ్ కింద ఒక్కో బస్సుకు ప్రభుత్వం డీజిల్ పోసి నెలకు రూ.80-90 వేల అద్దె చెల్లిస్తున్నదని, ఇందులో డ్రైవర్ జీతం పోగా రూ.60 వేలు ఈఎంఐలకు పోతున్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తమ సమస్యలపై అన్ని రీజియన్లలో సమావేశాలు నిర్వహించి, తుది నిర్ణయానికి వచ్చినట్టు ఆర్టీసీ అద్దె బస్సుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అబ్బా మధుకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. జనవరి 5లోపు సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు వెళ్తామని తేల్చి చెప్పారు.

340 అద్దె బస్సులకు టెండర్లు

నేడు ప్రీ బిడ్ సమావేశం

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ గ్రేటర్ జోన్ పరిధిలో 340 అద్దె బస్సులకు టీఎస్ఆర్టీసీ టెండర్లను ఆహ్వానిస్తున్నది. అద్దె ప్రాతిపదికన హైదరాబాద్ రీజియన్‌లో 162, సికింద్రాబాద్ రీజియన్‌లో 178 బస్సులు వివిధ రూట్లలో నడిపేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు గ్రేటర్ ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. టె